క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న గ్రామస్తులు



మిడ్జిల్: ఇసుక అక్రమ రవాణ కోసం వచ్చిన ఐదు ట్రాక్టర్లను స్థానికులు పట్టుకున్న ఘటన భైరంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు జడ్చర్ల మండలానికి చెందిన ట్రాక్టర్లు నిత్యం అక్రమ ఇసుక రవాణకు పాల్ప డుతున్నాయి. ఈ క్రమంలో మాటు వేసిన గ్రామస్తులు మంగళవారం దుందుభి వాగులోకి వచ్చిన ఐదు ట్రాక్టర్లను పట్టుకుని గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద ఉంచారు. ఇసుక అక్రమంగా తరలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ప్రమాద బీమా వినియోగించాలి



జడ్చర్ల టౌన్: పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో టాటా జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.399కే రూ.10లక్షల ప్రమాద బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి సూపరింటిండెంట్ వెంకట్‌రెడ్డి కోరారు. బాదేపల్లి పోస్టాఫీసులో టాటా జనరల్ ఇన్సూరెన్స్ చేసి ప్రమాదంలో పోతిరెడ్డిపల్లి సురేందర్ మరణించగా ఆయన భార్య జ్యోతికి రూ.10లక్షల చెక్‌ను వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ మాదవయ్య, వనపర్తి చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్, సబ్‌డివిజన్ మేనేజర్ గోరఖ్‌నాథ్, నాగర్‌కర్నూలు మేనేజర్ శ్రీనాథ్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 14 వవార్డులో మంగళవారం చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి పర్యటించారు. వార్డులో నిర్మిస్తున్న మిని ట్యాంక్‌బండ్‌ను పరిశీలించారు. పక్కనే ఉన్న పార్కును సందర్శించారు. వార్డులో నిర్మిస్తున్న మురుగుకాల్వలు, సీసీరోడ్లను పరిశీలించారు. వార్డులో ఉన్న ఇతర సమస్యలను కౌన్సిలర్ పుష్పలత, కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్, కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్, బుక్క మహేష్, చైతన్య, లత ఉన్నారు.

పరామర్శ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఎల్‌టీఎఫ్ ఆర్పీ సరితను చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, వార్డుకౌన్సిలర్లు పరామర్శించారు. సరిత భర్త రవీందర్‌రెడ్డి (46) సోమవారం రాత్రి హఠాన్మరణం చెందడంతో మంగళవారం ఉదయం ఆయన మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు.

ఏఎంఓ ఆకస్మిక తనిఖీ



భూత్పూర్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీని ఏఎంఓ శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని పాఠశాలలకు నూతన పాఠ్యపుస్తకాల పంపిణీ ,లైబ్రరీ కార్నర్ నిర్వహణ, స్కూల్ డ్రెస్ పంపిణీపై ఎంఈఓ నాగయ్యను అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ కార్నర్ నిర్వహణ కోసం 11 పాఠశాలలను ఎంపిక చేశామని, 10 పాఠశాలలకు మెటీరియల్ అందించామని, ఎల్కిచర్ల పాఠశాలకు త్వరలోనే అందిస్తామని ఎంఈఓ ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కోయిల్‌కొండ: మల్కాపూర్ గ్రామానికి చెందిన వడ్డెపెద్దరాజు, అనంతమ్మలు వారం రోజుల క్రితం భవానీసాగర్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి ముగ్గురు కూమార్తెలు అనాథలుగా మారారు. దీంతో అదే గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చెల్లాపురం శ్రీనివాస్‌రెడ్డి తనవంతుగా రూ.11వేలు అందించారు. ఆయన వెంట సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

నవాబుపేట: కిషన్‌గూడ గ్రామానికి చెందిన తిరుపతయ్యకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో రూ.2 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. సంబంధిత చెక్‌ను మంగళవారం లబ్ధిదారునికి హైదరాబాద్‌లో అందించారు. దీంతో ఎమ్మెల్యేకు మండల నాయకులు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

చదువులు సాగేదెలా..?



నవాబుపేట దర్పల్లిలో పిల్లర్లకే పరిమితమైన భవనం

- శిథిలావస్థలో పాఠశాల భవనాలు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలికిన బడులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యంత్రాంగం

నవాబుపేట: పాఠశాలలు సోమవారం నుంచి ప్రారంభం అయిన నేపథ్యంలో పలు సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలికాయి. ముఖ్యంగా తరగతి గదుల కొరత, ఉన్నవి కూడా శిథిలావస్థలో ఉండడం, నూతనంగా నిర్మిస్తున్నవి అసంపూర్తిగా మిగిలిపోవడం వంటి అనేక సమస్యలు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో దర్శనమిస్తున్నాయి. ఏటా ప్రభుత్వాలు సౌకర్యాల కల్పన కోసం నిధులు కేటాయిస్తున్నా.. క్షేత్రస్థాయిలో కొందరి నిర్లక్ష్యం ప్రభుత్వ బడుల పరిస్థితిని అగమ్యగోచరంగా మారుస్తోంది. ముఖ్యంగా తాగునీరు, ఉపాధ్యాయుల కొరత, మరుగుదొడ్లు సరిగా లేకపోవడం, తరగతి గదుల కొరత వంటి సమస్యలు పాఠశాలల తీవ్రంగా వేధిస్తున్నాయి.

చాలా గ్రామాల్లో ఉన్న పాఠశాలలు శిథిలావస్థలోనే కొనసాగుతున్నాయి. మండలం మొత్తం 92 ప్రాథమిక, 12 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. కాగా దాదాపు 8,893 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి దరిపల్లి, గురుకుంట, కారూర్, కామారం, ఇప్పటూర్, కూచూర్, హాజిలాపూర్, రంగంపల్లి, కల్మన్‌కల్వల్లో భవనాలు శిథిలమై ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అదేవిధంగా మండలంలో ప్రహరీలేని పాఠశాలలు 56 ఉండడం నిర్లక్ష్యానికి నిదర్శంగా కన్పిస్తున్నాయి.

ఇదిలా ఉంటే పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. రేకుల చౌడాపూర్‌లో 57 మంది విద్యార్థులకు ఒకరు, ఇప్పటూర్‌లో 105 మందికి నలుగురు, లోకిరేవులో 90 మందికి ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. లింగంపల్లిలో ముగ్గురు ఉండగా వారిలో ఇద్దరు వెళ్లిపోవడంతో ఒక్కరే మిగిలారు. దీనికి తోడు ఇంగ్లిష్ మీడియం ప్రారంభంతో మరింత ఇబ్బంది ఏర్పడింది.

మండల పరిధిలోని లింగంపల్లి, యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, కొల్లూర్, పోమాల్ తోపాటు దాదాపు 30 పాఠశాలలకు నీటి కొరత మూలంగా మరుగుదొడ్లు వినియోగంలో ఉండడం లేదు. దీంతో రూ.లక్షలు వృథా అయ్యే పరిస్థితి దాపురించింది. అదేవిధంగా నవాబుపేట, యన్మన్‌గండ్ల, లింగంపల్లి, కొండాపూర్, ఇప్పటూర్, గురుకుంటలో పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు వినియోగంలో లేక మూలకు పడ్డాయి.

నిర్మాణం కొనసాగుతోంది..



పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు తాత్కాలికంగా అందుబాటులో ఉన్నవారితో బోధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇంగ్లిష్ మీడియం ప్రారంభంతో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా మారింది. అయినప్పటికీ అందరికీ విద్య అందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీల భర్తీ జరిగే వరకు ఉన్నవారితో సరిపెట్టుకోక తప్పదు. ఇక ఆయా పాఠశాలల్లో గదుల కొరత లేకుండా నూతన భవనాలు నిర్మింప చేస్తున్నాం.

– రాజునాయక్, ఎంఈఓ

అభివృద్ధికి చర్యలు..



మండలంలోని పలు గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక నిధులతో యన్మన్‌గండ్ల, లింగంపల్లి, నవాబుపేటలో అదనపు భవనాలు నిర్మించి విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. కాగా ఇప్పటూర్, కాకర్లపహాడ్, దరిపల్లి గ్రామాల్లో భవనాలు ప్రారంభం కావాల్సి ఉంది.

– అనంతయ్య, ఎంపీపీ

కోడూరును సందర్శించిన కేంద్ర బృందం



కోడూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్ పొసామిబసు

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోడూర్ గ్రామాన్ని మంగళవారం కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్ పొసామిబసు అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామ సమీపంలోని ముక్కిరిగట్టు ప్రాంతంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిర్వహిస్తున్న పనులను బృందం సభ్యులు పరిశీలించి ఈజీఎస్ సిబ్బందితోనూ, కూలీలతోనూ మాట్లాడారు. కందకాల నిర్మాణానికి ముందు తర్వాత వచ్చిన మార్పులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చెరువులు, హరితహారం మొక్కలు, గ్రామంలో పలు అభివృద్ధి పనులు తదితర విషయాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ యాదయ్య, ఏపీడీలు జకియాసుల్తానా, శ్రీపాద రావు, ఎంపీడీఓ జ్యోతి, సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్, ఏపీఓ నరేందర్‌రెడ్డి, ఏపీఓ అమ్జద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఏపీఓ అమ్జద్, ఈసీ ఆనంద్, టెక్నికల్ అసిస్టెంట్ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

హన్వాడ: మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను మంగళవారం కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ పొసమిబసు (ఐఏఎస్)పరిశీలించారు. మునిమోక్షం శివారులో జలసంరక్షణ పనులను, రూఫ్‌టాఫ్ ఆర్వెస్టర్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులతో జలసంరక్షణ ప్రతిజ్ఞ చేయించి, నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలియజేశారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు

జడ్చర్ల: మహిళా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా ల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఆడపిల్లల పెళ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద సాయం అందజేస్తోందన్నారు. అదేవిధంగా 33 శాతం రిజర్వేషన్లు, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు, మహిళల భద్రతకు షీటీమ్స్ ఏర్పాటు, ఒంటరి మహిళలకు పింఛన్‌లు, మహిళా డిగ్రీ కళాశాలల ఏర్పాటు తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. అనంతరం మహిళా అధికారులను, ప్రజాప్రతినిధులను సన్మానించారు. జెడ్పీ సీఈఓ జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, జెడ్పీటీసీ కల్యాణి, ఎంపీడీఓ ఉమాదేవి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచాలి

కోయిల్‌కొండ: హరితహారంలో భాగంగా గ్రామాలలో ఏర్పాటుచేసిన వన నర్సరీల్లో సూచించిన మేరకు మొక్కలను సమయానికల్లా సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. సూరారం నర్సరీలో మొక్కలను మంగళవారం పరిశీలించారు. అనంతరం మల్లాపూర్ ఉపాధిహామీ పనులను పరిశీలించి మాట్లాడారు. అడిగిన ప్రతి కూలీకి పనికల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

స్టేషన్ మహబూబ్‌నగర్: పోలీసుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1995లో పోలీస్ ఉద్యోగానికి ఎంపికైన వారిలో సగం మందికి ఇప్పటికీ పదోన్నతులు లేవన్నారు.1996 తర్వాత ఎంపికైన వారికి అసలు పదోన్నతులే కల్పించలేదన్నారు. టీచర్ల మాదిరిగా పోలీసుల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ విధానం తీసుకురావాలన్నారు. వీఐపీలకు సంబంధించి ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు బందోబస్తు వెళ్లే పోలీసులకు టీఏలు ఇవ్వడం లేదన్నారు. నూతన మండలాల్లో ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్లలో ఒక పోలీస్ నియమించలేదని, వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నారే తప్పా, కేడర్‌స్ట్రెంత్ ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో మాజీ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు బెక్కరి అనిత, నాయకులు లక్ష్మణ్ యాదవ్, సుభాష్‌ఖత్రి పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తుల వెల్లువ



జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద గుమిగూడిన దరఖాస్తుదారులు

జడ్చర్ల: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గత రెండు రోజులగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాలు, పట్టణాలకు చెందిన దరఖాస్తుదారులు పెద్దఎత్తున బారులుతీరుతున్నారు. కాగా సకాలంలో ధ్రువీకరణ పత్రాలు జారీచేయడం లేదని, పడిగాపులు కాయల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా కుల వృత్తుల వారికి ప్రభుత్వం రు.లక్ష ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించడంతో, దరఖాస్తు చేసుకోవడం కోసం ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతున్నందునా పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయాలకు వస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. వీరికితోడుగా విద్యాలయాలు కూడా ప్రారంభం కావడంతో విద్యార్థులు సైతం పెద్ద సంఖ్యలో వస్తున్నారని అంటున్నారు. జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయానికి సోమ, మంగళవారల్లో దాదాపు వేయికి పైగా దరఖాస్తులు వచ్చాయంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కసారిగా పెద్దసంఖ్యలో దరఖాస్తులు రావడంతో వాటిని సకాలంలో విచారించి జారీ చేసేందుకు సంబంధిత సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే మరోవైపు తమకు గడువు ముంచుకొస్తుందని సకాలంలో పత్రాలు జారీ చేయాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా త్వరితగతిన జారీ చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా సాక్షికి తెలిపారు. సోమవారం ఒక్కరోజే దాదాపు 200కు పైగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేశామన్నారు.

21 నుంచి ఎంసీఎల్ సీజన్–2

పాలమూరు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈనెల 21నుంచి ఎంసీఎల్ సీజన్–2 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నట్లు నిర్వాహకుడు రమేష్‌రెడ్డి వెల్లడించారు. 12 జట్లతో టోర్నమెంట్ నిర్వహణ కొనసాగుతుందన్నారు. ఫైనల్‌లో గెలుపొందిన విజేత జట్టుకు రూ.1,00116 నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.50,116 నగదుతో పాటు ట్రోఫీలు అందజేస్తామని పేర్కొన్నారు. టోర్నమెంట్ పూర్తిగా నిబంధనల ప్రకారం కొనసాగుతుందని సూచించారు.

బదిలీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ జటిలం కావడానికి ప్రభుత్వ చిత్తశుద్ధి లోపమే ప్రధాన అవరోధంగా మారిందని తెలంగాణ ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి, న్యాయపరమైన చిక్కులను తొలగించడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. జటిలమైన కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యూలరైజేషన్, టీఎస్‌జీవో, టీజీవోల బదిలీలు, పదోన్నతులు సునాయాసంగా చేస్తున్న ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షకట్టడం సమంజసం కాదన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: చదువుతోనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం రైల్వే స్టేషన్ సమీపంలోని మజీద్ ఆవరణలో విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. దేశం, సమాజాభివృద్ధిలో విద్య పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రభుత్వాలు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రవీందర్‌రెడ్డి

భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తనతో పాటు, జిల్లా నాయకుడు ఎన్పీ వెంకటేష్‌ను సైతం కార్యవర్గ సభ్యుడిగా అధ్యక్షుడు బండి సంజయ్ నియమించినట్లు రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక

మిడ్జిల్: మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు లాలు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శులుగా వాసుదేవ్, భాస్కర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా శివరాజ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా విష్ణు, యువమోర్చా అధ్యక్షుడిగా అంజియాదవ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా సాధిక్ ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ నర్సింహులు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

నవాబుపేట: రైతుల భూములను అక్రమంగా లాక్కుంటామంటే ఊరుకునేది లేదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 142,143 సర్వే నంబర్లలలో రైతుల భూములను ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నించిన తరుణంలో రైతులు ఆయనను ఆశ్రయించగా అండగా ఉండి ఆందోళనలు చేస్తామని అన్నారు. రైతుల పొలాలు పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. నవాబుపేట భూముల విషయంలో ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతామన్నారు. కార్యక్రమంలోఆంజనేయులు, కుమార్, మల్లేష్, వెంకటయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి



టీడీగుట్ట ప్రాంతంలో పర్యటిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అబ్దుల్‌ఖాదర్ దర్గా వద్ద హైదరాబాద్–రాయచూర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం 33, 34వ వార్డుల పరిధిలోని టీడీగుట్టలో వీధి దీపాలను, కోయిల్ కొండ ఎక్స్‌రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద రూ.మూడు లక్షలతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పాఠశాలను తనిఖీ చేసి, ఆయా వార్డులలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

రైతు బీమా అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల దివిటిపల్లికి చెందిన రైతు చెన్నారం చెన్నయ్య మృతి చెందగా రైతుబీమా కింద మంజూరైన రూ. 5 లక్షల చెక్కును ఆయన భార్య పార్వతమ్మకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం అందజేశారు.

పార్టీలో చేరికలు

జిల్లా కేంద్రంలోని రెండు సడాకుల ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం ఆ ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, ముడా చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

మంత్రిని ఆశీర్వదించిన పండితులు...

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారని వేద పండితులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, వేద పండితులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పార్థసారథి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్ జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని, ఈ మేరకు దరఖాస్తు చేయాలని తహసీల్దార్ పార్థసారథి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు సరిగా ఉన్నాయా లేదా తెలుసుకుంటారని వివరించారు. కొత్తగా ఓటు నమోదు చేయడం, ఎవరైనా మరణిస్తే వారి పేరు ఓటరు జాబితా నుంచి తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని అన్నారు. గిర్దావర్ చైతన్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సత్యంయాదవ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ సిస్టం అమలు చేయండి

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 10వతరగతి నుంచి డిగ్రీ పీజీ చదువుతున్న ప్రతి విద్యార్థికి జీపీఎస్ సిస్టం అమలు చేయాలని స్టూడెంట్ రైట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దరాజు మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలోని వివరాలను జడ్చర్ల విలేకరులకు తెలియజేశారు. ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా తెలంగాణలో అమ్మాయిలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టలేకపోతున్నారని, ప్రతి విద్యార్థికి టై, యూనిఫాంలలో జీపీఎస్ సిస్టం తీసుకురావాలన్నారు. తద్వారా అమ్మాయిలు ఎక్కడ ఉన్నది తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని, అటువంటి పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ స్టూడెంట్స్ రైట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న డీఈఓ, ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజు, యాకుబ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గాలిగూడలో బొడ్రాయి పండుగ



బాలానగర్: కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని గాలిగూడలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు సర్పంచ్ అల్లాపురం రాంరెడ్డి తెలిపారు. బుధవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తదితరులు వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ పత్రం సమర్పణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్న స్థితిగతులు, వసతులు, విద్యాప్రమాణాలు తదితర అంశాలపై జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల అధ్యాపకులు రీసెర్చ్ ప్రతాన్ని ఎస్‌సీఈఆర్‌టీ సంచాలకులు అనురాధారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారిని డీఈఓ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మెరాజుల్లాఖాన్, నరేందర్, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వహించాలి

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయంగా ప్రతీ ఉపాధ్యాయుడు ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సింగారం క్రాస్‌రోడ్డులోని స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలో మంగళవారం దామరగిద్ద, కృష్ణ, ధన్వాడ మండల టీచర్లకు నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు చెప్పే ప్రతీ విషయం టీచర్ ముందుగా పాటించాలని, స్కూల్‌కి ఆలస్యంగా రావడాన్ని సహించబోమని అన్నారు. రోజువారి ప్రణాళికతో విద్యాబోధన జరగాలన్నారు. పాఠ్యాంశ బోధనకు టీఎల్‌ఎం ఉపయోగించాలని సూచించారు. 20న జరిగే విద్యా దినోత్సవం విజయవంతంగా చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం జిల్లాలోని 33 క్లస్టర్ల ఇన్‌చార్జ్‌లు, సీఆర్పీలతో కలెక్టర్ సమావేశమయ్యారు. పాఠశాలల పర్యవేక్షణ పకడ్బందీగా చేపట్టాలన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

నారాయణపేట: పట్టణ పరిశుభ్రతకు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహాయం అందించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో మంగళవారం పర్యటించి రోడ్డు, డ్రెయినేజీలను పరిశీలించారు. రోడ్ల పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయినేజీల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపాలిటి సిబ్బందిని, కమిషనర్‌ను ఆదేశించారు. రోడ్లపై ఇంటి నిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. సామగ్రి రోడ్లపై వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీఓ కిరణ్‌కు సూచించారు. కమిషనర్ సునీత, సిబ్బంది ఉన్నారు.